# అభిమానం

నమిలి మింగేసేంత కోపంగా చూసింది అంజలి శ్రీనివాస్‌ని.

"మీరు ఇట్లాంటి మనిషని తెలిస్తే అసలు ఈ పెళ్ళే చేసుకునేదాన్ని కాదు" అంది ఎర్రబడ్డ మొహంతో.

శ్రీనివాస్ నవ్వాడు. "కరక్టే" అన్నాడు తల వూపుతూ.

"మీ అంత మూర్ఖులు ఈ ప్రపంచంలో యింకెవరూ వుండరు"

"నిజమే" ఒప్పుకున్నాడతను.

"మీతో కాపురం చేయడం కంటే దరిద్రం లేదు"

"ఊహు!?"

చిర్రెత్తుకొచ్చింది అంజలికి ఆ సమాధానాలు వింటే.

"ఛీ" అంది కుర్చీలోనుంచి విసురుగా లేస్తూ. "అసలు మీతో మాట్లాడటమే బుద్ధి తక్కువ"

వడివడిగా బయటకి వచ్చి కార్లో కూర్చుంటుంటే వెనుకనుంచి శ్రీనివాస్ నవ్వు గాలితోపాటూ తేలివచ్చి ఆమెని మరికాస్త ఉడికించింది. ఆమె వెనుకే శ్రీనివాస్ వచ్చి ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

కోపమంతా తలుపు మీద చూపించి కారు స్టార్ట్ చేసింది అంజలి.

"అసలు ఏమిటి ఈ మనిషి! ఇంత చదువుకున్నారు. డాక్టర్‌గా యింత పేరు సంపాదించారు. ఇంత డబ్బు సంపాదించారు. ఈ చిన్న విషయం అర్థం కాకపోతే యిక ఎందుకు!"

"ఎవరితో ఎలా బిహేవ్ చేయాలో తెలీదు. అందరితోనూ ఒకటే స్నేహం. ఒకటే గొడవ. డిగ్నిఫైడ్‌గా ఉండడమే తెలీదు" రోడ్డుపైపే తదేకంగా చూస్తూ వాపోయింది అంజలి.

"ఏమిటోయ్! ఇంత చిన్న విషయానికి అంత కోపమా!" శ్రీనివాస్ మాటలు వినబడగానే ఛర్రున చూసింది.

"మీకేం తెలుస్తుంది నా బాధ! పెళ్ళిచూపులపుడు హుందాగా వున్నారని మురిసిపోయాను. చదువూ, డిగ్రీలూ అన్నీ నేను ఆశించినట్లుగానే వున్నాయని ఆనందపడ్డాను. ఏం లాభం!" దుఃఖంతో ఆమె గొంతు వణికింది.

"కాపురానికి వచ్చిన రోజునుంచీ చూస్తున్నా. నా వల్ల కాదు యిక మిమ్మల్ని భరించడం"

శ్రీనివాస్ నవ్వాడు. ఆమె తల మీద చిన్నగా తట్టి, "నిన్న ప్రొద్దున సరిగ్గా యిదే టైమ్‌కి నువ్వేమన్నావో గుర్తుందా!" అని అడిగాడు.

అంజలి ఆశ్చర్యంగా చూసింది. "ఏమన్నాను!" అంటూండగానే ఆమెకు గుర్తొచ్చింది.

రెండ్రోజుల క్రితం శ్రీనివాస్ ఒక ఆపరేషన్ చేశాడు. యాక్సిడెంట్ కేస్.

అందరూ ఆశ వదిలేసుకున్న టైంలో.. పేషెంటే కాదు, మిగతా డాక్టర్స్ కూడా.. చాలా నేర్పుతో ఆపరేట్ చేసి అతన్ని బ్రతికించాడు.

అందరూ శ్రీనివాస్‌ని ప్రశంసలతో ముంచెత్తారు.

మిగతావారు పొగిడారని కాదు కానీ ఒక డాక్టర్‌గా అంజలికి కూడా అర్థమయింది అతని ప్రతిభ.

అతనిపట్ల ఆరాధనతో శరీరం పరవశించింది.

అదే చెప్పింది నిన్న అతనితో కార్లో వెళుతూన్నపుడు. " యు ఆర్ గ్రేట్" అంది నిన్న సరిగ్గా యిదే టైంకి యివే పెదాలతో.

అదంతా తల్చుకుంటే అంజలికి కూడా నవ్వొచ్చింది.

కానీ అంతలోనే ముందురోజు జరిగినది గుర్తొచ్చి మొహం వాడిపోయింది.

క్రితం రోజున హాస్పిటల్‌కి విజిటర్స్ వచ్చారు. విజిటర్స్ అంటే మామూలుగా వచ్చే వ్యక్తులు కాదు. ఇద్దరు మినిస్టర్స్. చాలామంది పెద్ద పెద్ద ఆఫీసర్స్.

ఆ విజిట్ కోసం వారంరోజులనుంచీ ప్రిపరేషన్స్ జరుగుతున్నాయి హాస్పిటల్‌లో. డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ వసంత, తను, శ్రీనివాస్ వాళ్ళని రిసీవ్ చేసుకుని హాస్పిటల్ అంతా చూపిస్తున్నారు. కొత్త ఎక్విప్‌మెంట్ డెమాన్‌స్ట్రేట్ చేస్తున్నారు.

సరిగ్గా అప్పుడు వచ్చాడు.. ఎవరో అభిజిత్‌ట. పాటలు పాడతాడట.

అప్పటికప్పుడు శ్రీనివాస్‌ని చూడాలని గొడవ రిసెప్షన్‌లో. రిసెప్షనిస్ట్ పైకి ఫోన్ చేసి చెప్పింది. "ఇంక ఈయన.." అంజలి పెదవులు చిరాకుగా ముడుచుకున్నాయి. ఆ ఫోన్ పెట్టేసి, " ఎక్స్‌క్యూజ్ మీ" అన్నారు.

ఏమిటా అని తను తలెత్తి చూసేసరికి అక్కడ లేరు.

రెండేసి మెట్లు ఒక్కసారే దిగుతూ క్రిందకి వెళ్ళిపోయారు. ఎంత ఎంబరాసింగ్‌గా అనిపించింది తనకి! అయిదు నిమిషాలు చూసి తను కూడా క్రిందకి వెళ్ళింది.

అక్కడి దృశ్యం!.. ఆహా! చెప్పటానికి మాటలు లేవసలు. అంజలి మొహం మళ్ళీ ఎర్రబడింది.

ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు కావిలించుకోవడమేనా! భుజాలు చరుచుకుని నవ్వుకోవడమేనా! ఈయన క్రాఫ్‌లో వేళ్ళు దూర్చి జుట్టంతా రేపేస్తూ "ఎన్నాళ్ళయిందిరా యిడియట్ నిన్ను చూసి!" అంటున్నాడు ఆయన.

ఈయనేమో అతని వీపు మీద దబదబా బాదేస్తూ ఏమిటేమిటో చెప్తున్నారు.

టక్ చేసిన షర్ట్ పైకి వచ్చేయడం తెలీదు. కాలర్ లేచి నిలబడడం తెలీదు. అసలు ఒళ్ళే తెలీడం లేదు ఈయనకి.

రిసెప్షనిస్టూ.. పేషెంట్సూ.. అందరూ వెర్రిమొహాలు వేసుకుని చూస్తున్నారు వీళ్ళ వంక.

ఆ దృశ్యం కళ్ళముందు మెదిల్తేనే అంజలికి కంపరమెత్తుతోంది. అందరిముందూ అలా బిహేవ్ చేస్తే వాళ్ళకి ఈయన అంటే ఏం

గౌరవముంటుంది!

"అంజూ!" శ్రీనివాస్ అంజలి చెవి దగ్గరగా వంగి పిల్చాడు.

చిరాకుగా తల విదిల్చింది అంజలి.

"ఎందుకమ్మా అంత కోపం!" అన్నాడు లాలనగా.

"మీకర్థం కాదులెండి" పళ్ళ బిగువున చెప్పింది. " మీకసలేం అర్థం కాదు."

శ్రీనివాస్ సీట్లో సర్దుకుని కూర్చుంటూ "ఊ" అన్నాడు. "ఏం అర్థం కావాలి!" అడిగాడు మళ్ళీ తనే.

అంజలి తలతిప్పి అతన్ని తదేకంగా చూసింది.

"నిజంగా మీకు యిప్పటికి కూడా తెలీడం లేదా! నిన్న మీరిద్దరూ ప్రవర్తించిన విధానం చాలా అసహ్యంగా వుందని మీకసలు ఏ కోశానా అనిపించడం లేదా!" అంది.

శ్రీనివాస్ మొహం గంభీరంగా మారిపోయింది.

"అసహ్యం!.. ఎంత దారుణమైన మాటలు వాడతావు నువ్వు! నా ఫ్రెండ్.. ఎన్నోరోజుల తర్వాత చూశాను వాడ్ని. ప్రాణస్నేహితుడు. అసలు మనింట్లో దిగాల్సిన వాడు... ఎక్కడో హెూటల్లో వుండి వెళ్ళిపోతుంటే.. వాడితో అయిదునిమిషాలు మాట్లాడటమే నీకు అ..స..హ్యం..గా వుందా!"

అతని గొంతులో తొణికిసలాడిన బాధకి అంజలి నొచ్చుకుంది.

"ఎందుకు నన్నిలా చెడ్డదాన్ని చేస్తారు? ఉండమనండి. ఒక రోజు కాకపోతే వందరోజులు మన యింట్లో వుండమనండి. దానికి నేను అభ్యంతరం చెప్తానా!" అంది.

"నువు వుండమన్నా వాడు వుండడు. సాయంత్రం రవీంద్రభారతిలో వాడి ప్రోగ్రాం వుంది. అది అవగానే రేపు ప్రొద్దునే వెళ్ళిపోతాడు" కినుకగా చెప్పాడు శ్రీనివాస్.

"అసలు మీరు నిజంగా.." తల విదిలించింది అంజలి. "ఎందుకు విషయాన్ని

అలా ప్రక్కదారి పట్టిస్తారు! మీస్నేహాన్ని వదులుకోమని నేను చెప్పలేదు. అతను అలా ఒరేయ్, గిరేయ్ అనడం బాగాలేదన్నాను. "ఒరేయ్ శ్రీనూ!" అని పిలవవద్దని చెప్పండి చాలు."

"నేను చెప్పను" అన్నాడు శ్రీనివాస్ "వాడికి నన్ను ఎలా పిలవాలనిపిస్తే అలా పిలుస్తాడు. అది వాడిష్టం."

"అదేమి.."

అంజలి మాటల్ని మధ్యలోనే కట్ చేశాడు శ్రీనివాస్. "నీ ఫ్రెండ్ నిన్ను "ఏమే అంజా" అన్నపుడు నేను మాట్లాడితే అప్పుడడుగు"

"నన్ను అలా పిల్చే ఫ్రెండ్సెవరూ లేరు" కొట్టినట్లుగా చెప్పింది అంజలి. కారు ఒక ప్రక్కగా ఆపుతూ.. "నేను మీలాగా కాదు. నాకు యిష్టం లేకపోతే మొహమాటం లేకుండా చెప్పేస్తాను, అలా పిలవద్దని" అంది.

"అదే.. మరి" అన్నాడు శ్రీనివాస్ "నీకు యిష్టం లేకపోతే వద్దని చెప్తావు. ఇష్టమయితే పిలిపించుకుంటావు. అది కేవలం నీకు సంబంధించిన విషయం. నేను జోక్యం చేసుకోకూడని విషయం. నా ఫ్రెండ్ విషయమైనా అంతే" మాట పూర్తి చేస్తునే డోర్ తెరుచుకుని దిగేశాడు శ్రీనివాస్.

అంజలి దిగేలోపే వడివడిగా మెట్లెక్కుతూ పైకి వెళ్ళిపోయాడు.

*****

"అలా కొంపలు మునిగిపోయినట్లు మొహం పెట్టకపోతే కొంచెం నవ్వరాదూ!" శ్రీనివాస్ మాటలకి చిరచిరలాడుతూ చూసింది అంజలి.

"నేను యింటికి వెళ్ళిపోతాను. మీరు చూసి రండి ప్రోగ్రాం" అంది.

"శ్రీనివాస్ నవ్వాడు "వందోసారి ఈమాట చెప్పడం!" అన్నాడు.

"ఏం లాభం! మీకు లక్ష్యం లేదుగా!" ఉక్రోషపడింది అంజలి. "ఈ డొక్కు

ప్రోగ్రాం చూస్తే గానీ నిద్ర పట్టేలా లేదు మీకు" అరిచినట్లుగా అంది.

చుట్టూ నిలుచున్న వాళ్ళందరూ తలలు తిప్పి చూశారు. "ష్. ఊర్కో. అందరూ చూస్తున్నారు" అన్నాడు శ్రీనివాస్ మందలింపుగా.

అంజలి మాట్లాడలేదు. చీర అంచులు వేళ్ళతో లాగుతూ గోడకి ఆనుకుని నిలబడింది.

ముందురోజు జరిగినది తల్చుకున్నకొద్దీ ఆమె అసహనం పెరుగుతోంది. "అరే శ్రీనూ!" అన్న అభిజిత్ పిలుపు పదేపదే చెవుల్లో వినపడుతోంది.

"చక్కగా శ్రీనివాస్ అని పిలవలేడూ! అరే శ్రీనూట అరే శ్రీనూ.." పెదవులు బిగిస్తూ అనుకుంది. "ఎంత ఎదిగినా సంస్కారం వుండదేమిటో మనుషులకి!"

గొల్లున నవ్వులు వినిపించడంతో ఆలోచనలలోనుంచి తెప్పరిల్లింది అంజలి. ఒకప్రక్కన పదిమంది అమ్మాయిలు నిల్చుని వున్నారు.

వాళ్ళ చీరల్ని.. తలలో పువ్వులనీ.. నవ్వులనీ పరీక్షించింది కాసేపు. ఎంత అందమైన అమ్మాయిలయినా అయిదు నిమిషాలు చూసేసరికి విసుగొచ్చింది.

"ఇంకా ఎంత సేపు నిల్చోవాలి మనం!" చిరాగ్గా అడిగింది.

"అరే!" అన్నాడు శ్రీనివాస్ "యిపుడేగా వచ్చాం. ఒక్క అయిదునిమిషాలు నిల్చోలేవూ! వాడు రాగానే లోపలికి తీసుకువెళ్తాడు" అనునయంగా చెప్పాడు.

"బోర్ ఎందుకు కొడుతోంది నీకు? నాతోనేగా వున్నావు! ఏమన్నా కబుర్లు చెప్పు. అసలు సరదాగా వుండడమే తెలీదే!" అన్నాడు మళ్ళీ తనే.

"ఆс. సరదాగానే వుంది, ఈ అర్థంలేని ప్రోగ్రాం చూడటం. నన్నొదిలి పెట్టండి మహానుభావా! ఏదన్నా సినిమాకి వెళ్తాను" విసుగ్గా అంది అంజలి.

ప్రక్కన గుంపుగా నిలుచున్న మగపిల్లలలో ఒక అతను వీళ్ళవైపు తిరిగాడు.

"ఏంటి మేడమ్! ఏమంటున్నారు!" అన్నాడు.

అంజలి తలెత్తి చూసింది. అతను సమాధానం కోసం వెయిట్ చేస్తున్నట్లుగా

ఆమె మొహంలోకే సూటిగా చూశాడు.

అంజలి మాట్లాడకుండా మొహం తిప్పుకుంది.

"ఒరే సిరాజ్!" అతను కేక పెట్టాడు.

కొంతదూరంలో నిల్చుని ఎవరితోనో మాట్లాడుతున్న సన్నటి పొడుగాటి వ్యక్తి వెనుదిరిగి చూశాడు.

వస్తున్నానన్నట్లుగా తలవూపి.. అవతలివాళ్ళతో ఏదో చెప్పి యిటు అడుగులు వేశాడు.

అంజలీ , శ్రీనివాస్ యిద్దరూ అటువైపు చూపు సారించారు.

చాలా బాగున్నాడు అతను. పొడుగ్గా. ధృడంగా. అమాయకంగా. చురుగ్గా.

అతను దగ్గరికి రాగానే ప్రక్కపిల్లలందరూ అతని చుట్టూ చేరి ఏమిటేమిటో చెప్పసాగారు.

"నీ గురించే చెప్పుకుంటున్నారు వాళ్ళు" అన్నాడు శ్రీనివాస్ అంజలి చెవిలో మెల్లగా.

అంజలికీ అదే అనుమానం వచ్చింది కానీ పైకి మాత్రం "నా గురించి ఎందుకు చెప్పుకుంటారు?" అంది బింకంగా.

"అదిగో విను కావాలంటే. ఆవిడ యిప్పుడే పచ్చిమిరపకాయలు తిని వచ్చిందీ.. ఆ కోపం అంతా అభిజిత్ మీదా, ప్రోగ్రాం మీదా చూపిస్తోందీ అని చెప్పుకుంటున్నారు" ఇంకాస్త అల్లరిగా అన్నాడు శ్రీనివాస్.

అంజలి మొహం ఎర్రబడింది. "పోన్లేండి. చెప్పుకుంటే చెప్పుకున్నారు" అంది తల మరోవైపుకి త్రిప్పుకుంటూ.

అప్పటివరకూ గమనించలేదు కానీ చాలామంది జనం వచ్చారు. కారిడార్ అంతా క్రిక్కిరిసి పోయింది.

"అమ్మో! ఎంతమంది వచ్చారు!" అంది అంజలి అప్రయత్నంగా. "ఏం

పాడతాడు ఈయన అంత అద్భుతంగా!"

శ్రీనివాస్ మొహంలో కొంటెతనం మెరిసింది. "వాడి బొంద. వాడూ సరే. వాడి పాటా సరే. రాకపోతే ఏడుస్తాడని వచ్చాను"

అతని మాట పూర్తి కానేలేదు. ఢమన్న శబ్దం వినబడింది అంజలికి.

ఆతర్వాత తన కాళ్ళ దగ్గర శ్రీనివాస్ వెల్లకిలా పడివుండడం కనిపించింది.

"ఏమయింది! . ." ఆమె క్రిందికి వంగబోయేలోపూ

అతను. . అతనే. . సిరాజ్. . ముందుకి వంగి శ్రీనివాస్ కాలర్ పట్టుకుని లేపి నిలబెట్టాడు.

"జాగ్రత్త. ఇంకెప్పుడూ అభిజిత్ అన్న పేరు పలకకండి. . నాలుక తెగిపోతుంది." అన్నాడు కామ్‌గా.

అతని ఫ్రెండ్స్ ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ప్రశాంతంగా చూస్తూ నిలుచున్నారు. అదంతా చాలా సహజం అన్నట్లు.

అంజలి బిత్తరపోయింది. శ్రీనివాస్ పెదవుల మీదికి నవ్వు తెచ్చుకుని "అరే భాయీ!" అన్నాడు. "వాడు .. అభిజిత్. . నా ఫ్రెండయ్యా. కూనిరాగాలు కూడా తీయడం రానప్పటినుంచీ నాకు తెలుసు. . ."

"ఏయ్" సిరాజ్ అరుపు కారిడార్‌లో ప్రతిధ్వనించింది.

ఈసారి అంజలి తేరుకుని చూసేసరికి శ్రీనివాస్ చెంప మీద అయిదువేళ్ళ ముద్ర. . పెదవికి ఒక ప్రక్కగా చిన్న రక్తపు చారా కనిపించాయి.

"యూ. . యిడియట్" అరిచింది అంజలి "ఎంత ధైర్యం నీకు యిలా చేయి చేసుకోవడానికి! ఇంతమంది జనం వుండగా. . పట్టపగలు యింత రౌడీయిజమా! ఎవరనుకుంటున్నావు ఈయన! డాక్టర్ శ్రీనివాస్" శ్రీనివాస్‌ని పొదివిపట్టుకుంటూ సపోర్ట్ కోసం చుట్టూ చూసింది.

జనమంతా వింతగా, ఉద్వేగంగా, నిర్లిప్తంగా. . రకరకాల భావాలతో యిటే చూస్తున్నారు. కానీ నోరు మెదిపే వుద్దేశ్యం మాత్రం ఎవరికీ వున్నట్లు లేదు.

కొట్టినవాడు రెండు జేబుల్లో చేతులు పెట్టుకుని "ఇంక ఇంటికి వెళ్ళండి" అన్నట్లు చూస్తున్నాడు.

అతని ఫ్రెండ్స్ అందరూ సన్నటి నవ్వుతో గొణుక్కుంటున్నారు. "డాక్టర్ అయితే ఎవడికి లెక్క! అభిజిత్‌ని పట్టుకుని వాడు.. వాడి బొంద.. అంటాడా! కూనిరాగాలు అంటాడా.. అది కూడా మన సిరాజ్ ముందుకొచ్చి!" అన్నాడు ఒకడు.

"ప్రొద్దున్నే కాస్త మంచిమొహం చూసినట్లున్నాడు. ప్రాణాలతో బయటపడ్డాడు" గొల్లున నవ్వారు అందరూ.

అంజలి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఎంత అవమానం!"

ఎందుకిలా అయిందివాళ! తల తిరుగుతున్నట్లుగా అనిపించింది. ఒక్కసారి అక్కడినుంచి మాయమయిపోగలిగితే బాగుండుననిపించింది.

దూరంగా ఏదో కలకలం. అతను వచ్చాడు. అభిజిత్. అవును. అతనే! అందరూ త్రోసుకుంటున్నారు. ఆటోగ్రాఫుల కోసం ఎగబడుతున్నారు. సిరాజ్.. గ్రూపూ కూడా.

ఏమిటి చెప్తున్నారు అతనితో! ఈ గొడవంతా చెప్తున్నారా!

అభిజిత్ నొసలు ముడివేసి చూస్తున్నాడు. ఇటే వస్తున్నాడు వడివడిగా. శ్రీనివాస్‌ని పలకరించేందుకు కాబోలు.

అంతా కలలా వుంది అంజలికి. అందరూ కనిపిస్తున్నారు కానీ.. అదంతా తన ప్రక్కన జరుగుతున్నట్లుగా లేదు. తన కళ్ళముందు జరుగుతున్నట్లుగా లేదు. అభిజిత్ వచ్చి శ్రీనివాస్‌ని దగ్గరికి తీసుకుంటున్నాడు. ఇంకెవరో మంచినీళ్ళు తెచ్చిచ్చారు.

నోటిదగ్గర అంటిన రక్తాన్ని కర్చీఫ్‌తో తుడిచి మంచినీళ్ళు తాగిస్తున్నాడు అభిజిత్.

"పర్లేదురా! ఏం కాలేదు" శ్రీనివాస్ వారిస్తున్నాడు.

"అదికాదు సర్. మీ గురించి ఎవరైనా అగౌరవంగా మాట్లాడితే మాకు చాలా బాధగా వుంటుంది. మీ ఫ్రెండ్ అయినా సరే.. మాముందు వాడు.. వీడు .. అంటే మాకు బాగుండదు సర్!" సిరాజ్ మాటలు వినబడ్డాయి.

"ఎందుకు బాగుండదు సిరాజ్!" అభిజిత్ గొంతు ఖంగున మ్రోగింది. "మా అమ్మ నన్ను "ఏరా నాయనా!" అంటే నీకు బాగుండదా! నన్ను ప్రేమగా దగ్గరికి తీసుకుంటే బాగుండదా!"

"..సర్!" సిరాజ్ బిత్తరపోయినట్లుగా చూశాడు.

"చూడు సిరాజ్. నాకు తెలుసు నామీద నీకు ఎంత అభిమానం వుందో. నాకు నువ్వు వ్రాసిన లెటర్స్ అన్నిటినీ నేను ఎంతో భద్రంగా దాచుకున్నాను. నువు పంపిన సరస్వతీ దేవి పెయింటింగ్‌ని హాల్లో అలంకరించాను. రోజూ ప్రొద్దున్నే ఆ పటానికి ఒక గులాబీ పూవు పెట్టి నమస్కారం చేయకపోతే, నాకు మనసంతా వెలితిగా వుంటుంది. అది మనిద్దరిమధ్యా వున్న బంధం.

అలాగే ఒక్కొక్క వ్యక్తితో ఒక్కోరకమైన బంధం వుంటుంది.

శ్రీనివాస్ నా ఫ్రెండ్. వాడు నాకు ప్రాణం కన్నా యిష్టంగా అనిపించిన సందర్భాలున్నాయి.

వాడు.. వాడంటే నాకెంత యిష్టమంటే మేమిద్దరమూ కలిసి పంచుకున్న బాల్యం అంత.

వాడు నన్ను "ఒరేయ్" అనే పిలవాలి. "ఏరా!" అనే అనాలి. "అభిజిత్ గారూ!" అని అందరూ పిల్చినట్లు పిలిస్తే, నాకు ప్రాణం పోయినంత బాధగా వుంటుంది. నా బాల్యం చచ్చిపోయినట్లుగా అనిపిస్తుంది.

బాల్యస్నేహం అనేది చాలా అపురూపమయిన వరం సిరాజ్. ఆ అనుబంధం.. అది ప్రతి మనిషికీ ప్రత్యేకం. దాన్ని నియంత్రించే అధికారం జీవితంలో మరే వ్యక్తికీ వుండదు. చివరికి భార్యకీ, పిల్లలకీ కూడా. అంతవరకూ ఎందుకు! మా ఆవిడకీ, పిల్లలకీ నేనంటే ఎంతో యిష్టం.

అంతమాత్రాన మా ఆవిడ శ్రీనివాస్ లాగా "ఒరేయ్ అభిజిత్!" అనగలదా నన్ను! నా పిల్లలు అనగలరా అలా!

ఎవ్వరూ.. ఎవ్వరూ లేరు. నా పసితనాన్ని శ్రీనివాస్ తప్ప మరెవరూ గుర్తు చేయలేరు నాకు!

నా మనసు ప్రశాంతమైన ఆనందంతో ఉయ్యాలలా పూగడం.. అది ఒక్క శ్రీనివాస్‌ని చూసినపుడే జరుగుతుంది."

అభిజిత్ మాటలు ఆగేసరికి ఒక్కసారిగా నిశ్శబ్దం అలముకుంది. ఆ తర్వాత మెలమెల్లగా సన్నటి జలధారలా శబ్దం క్రమ్ముకుంది.

అతను తమవైపు తిరగడం మసకమసకగా కనపడింది అంజలికి. ఆమె రెండు కళ్ళలోనుంచి నీళ్ళు కారుతున్నాయి.

కుడిచేత్తో శ్రీనివాస్‌ని అలాగే పొదివి పట్టుకుని, అంజలిని చూసి నవ్వాడతను. "భయపడ్డారా!" అన్నాడు. "మీకు చాలా ధైర్యం అని చెప్తాడే మా శ్రీను!" అతని ఎడమచేయి ధైర్యం చెప్తున్నట్టుగా తన భుజం మీద పడడంతో అంజలి ఉలిక్కిపడింది.

కంగారుగా దూరం జరగబోయింది. కానీ ఒక్కసారిగా గుండెలలోనుంచి తన్నుకొచ్చిన ఏడుపుని మింగేస్తూ.. అప్రయత్నంగా అతనికి మరికొంచెం దగ్గరగా జరిగింది.

ముగ్గురూ హాల్లోకి నడుస్తూంటే వాళ్ళ వెనుక జనసమూహం సముద్రంలా సాగింది.

*****

("స్వాతి" మాసపత్రిక – ఫిబ్రవరి 1996)